# ఇన్లాండ్ లెటర్ కథలు

## మార్పు

రాత్రి సమయం తొమ్మిది గంటలు దాటింది. బయట చలి అధికంగా వుండడం వల్ల అడపా దడపా ఒకరిద్దరు తప్ప వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. వచ్చేది పరీక్షల సీజన్ కావడం వల్ల అప్పటివరకు ట్యూషన్‌లోనే చదువుకుని ఇంటిదారి పట్టింది రాణి. మొదట కాస్త బెరుకుగా అనిపించినా విద్యుత్ దీపాల వెలుగులో అడుగులు వేస్తూ రోడ్డువెంట సాగిపోతోంది.

కాస్సేపటికి వెనకనుంచి ఏవో మాటలు చెవిని కర్కశంగా తాకుతున్నాయి.


"ఏరా, అదేనా నిన్ను కొట్టింది?"

"అవును గురూ..."

"అటువంటిదాని చెంపే కాదు, చేయి తాకడం కూడా అదృష్టమేరా"

ఒక్కసారిగా వెనుదిరిగి చూసింది రాణి. చీకటి దట్టంగా వుండడం వల్ల వారి మొహాలు స్పష్టంగా కనిపించలేదు. కానీ వారు మాత్రం తననే వెంబడిస్తున్నట్టు గుర్తించింది. అప్రయత్నంగా ఆమె నడకలో వేగం పెరిగింది. అందులో ఒకడు ఆమెను సమీపించి "ఆగవే అరుంధతీ మావాడిని కాదన్నావట. అందుకనే నేనొచ్చాను" అంటూ రాణి నడుంపై చెయ్యి వేశాడు. ఉరిమే కన్నులతో వెనుదిరిగి చూసింది రాణి. ఆ వెనువెంటనే అతని మొహంలో కొత్త మార్పు. "చెల్లెమ్మా" అంటూ తలదించుకుని నించున్నాడు. అప్పుడు గుర్తించింది రాణి అతను తన తోబుట్టువని.

ఇంటిదగ్గర శ్రీరాముడులా ఉండే. అన్నయ్య గురించి తన స్నేహితురాళ్ళు దారికాచి అల్లరి చేస్తున్నాడని ఎన్నిసార్లు చెప్పినా తను వినలేదు. పైగా వాళ్ళతో పోట్లాడి స్నేహాన్ని కూడా తెంచుకుంది. తాను ఊహించుకున్న శ్రీరాముడి



లాంటి అన్నలో కీచకుడు దాగివున్నాడని తెలిశాక అతని తోడబుట్టినందుకు అసహ్యం ఉప్పెనలా పొంగింది ఆమెలో.

"ఏం ఎందరి జీవితాలతోనో ఆడుకున్నవాడివి నీ చెల్లెలివని నరన లడ్డూస్తున్నాయని సంకోచిస్తున్నావా. నీకు కావలసింది ఆడదేగా... పరవాలేదురా" అంది రాణి.

రాణి మొహం చూడలేక మొహం పక్కకు తిప్పుకున్నాడు అతను.

ఆనాటినుంచి అతనిలో వచ్చిన మార్పు చూసి ఎంతో సంతోషించింది రాణి.

—జి.వి.ఎస్.ఎస్.కుమార్

---



## కనువిప్పు

'పోస్ట్..' పోస్ట్‌మాన్ పిలుపుతో లెటరందుకున్న లక్ష్మి ఆతురతగా చదివింది. కాని భర్త ఆశయాలకు, అనురాగాలకు స్పందించక నువాయాసంగా కొట్టిపారేసింది.

లక్ష్మికి నరేష్‌తో పెళ్ళై రెండేళ్ళైనా ఇద్దరిమధ్య పరస్పరావగాహనలు అంతగా లేవు. లక్ష్మికి ఈమధ్యనే లభించిన ఉద్యోగరీత్యా పుట్టింటిలోనే పట్నంలో వుంటూన్నది. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే కాని కాపురం మాత్రం సాఫీగా జరగడం లేదు. తల్లిదండ్రుల పోషణలో గ్రామంలో వుంటున్న భర్తను గురించి ఏరోజూ పట్టించుకోలేదు లక్ష్మి.

భక్తి, సంస్కారం, అభిమానం వున్న నరేష్ తన భార్య తనతో ఏకీభవించడం లేదని నొచ్చుకునేవాడు. కోపం, అహంకారం, మొరటుదనం తొణికిసలాడుతున్న లక్ష్మిని గురించి తనలో తాను బాధపడుతుండేవాడు.

అమ్మ చనువు వల్ల పుట్టింటికి మెట్టినింటికి భేదం తెలిని లక్ష్మి తన అన్నదమ్ములను, చెల్లెళ్ళను, వదినెలను చెలాయించినట్టే భర్తను కూడా చెలాయించేది.

ఈమధ్యనే లక్ష్మి అన్న కూతురికి నామకరణం రాజమండ్రిలో గొప్పగా జరిగింది. బంధువులందరూ హాజరయ్యారు నరేష్ తప్ప. చుట్టాల సందడి పరిచయాలు, పరామర్శలు కోలాహలంగా వుంది. "నీ భర్త ఎవరే, ఎక్కడే, రాలేదూ" అంటూ చుట్టాలు ఆటపట్టించారు లక్ష్మిని. ఆ ప్రశ్నల వర్షానికి తట్టుకోలేక మూల కూర్చుంది. ఆమె కళ్ళవెంబడి నీరు సుడి తిరిగింది.

విద్య, డబ్బు మాత్రమే దాంపత్య జీవితాన్ని సుఖపెట్టలేవు. భర్త అడుగుజాడలు లేని జీవితం వ్యర్థమని లక్ష్మి మరుసటి దినమే భర్తగారి ఇంటికి వచ్చింది. శ్రీవారూ క్షేమమా అంటూ భర్త బాగోగులలో పాలు పంచుకుంది. భర్త తోడు లేనిదే పుట్టింటిలో మకాం వేయను అంటూ మనసువిప్పి మనసు పంచిన లక్ష్మి మాటలకు నరేష్ దేవుడికి థాంక్స్ తెలుపుకున్నాడు. అత్తమామల సేవ, ఆదరణ, భర్త ప్రేమానురాగాలు పంచుకున్న లక్ష్మికి కనువిప్పు కలిగి ఇటు సంసార జీవితం, అటు ఉద్యోగం ప్రశాంతంగా సాగిస్తోంది.

—ఆర్. సూర్యనారాయణ